క్లుప్తంగా

బాధ్యతగా మొక్కలు పెంచండి



వెలుగు కార్యాలయం వద్ద మొక్కలను నాటుతున్న ఏరియా కో ఆర్డినేటర్ గంగాధర్

కణేకల్లు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, పెంచాలని రాయదుర్గం వెలుగు ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం కణేకల్లులోని వెలుగు కార్యాలయంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. డ్వాక్రా మహిళలతో కలిసి ఆయన కార్యాలయ ఆవరణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందప్ప, సీసీలు ఎర్రిస్వామి, గోవిందు పాల్గొన్నారు.

కూడేరులో ఎలుగుబంటి సంచారం

కూడేరు: కూడేరు వ్యవసాయ పొలాల్లో ఎలుగుబంటి సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. కూడేరు నుంచి తలుపూరు వెళ్లే రోడ్డు వైపున ఉన్న పొలం వద్దకు బొజ్జన అనే రైతు శుక్రవారం రాత్రి 11:45 గంటల ప్రాంతంలో వెళ్తున్నాడు. రైతు జయప్ప జామ తోట వద్ద ఎలుగుబంటి కనిపించింది. పక్కన పొలంలో ఉన్న రైతు వెంకటేష్‌కు చెప్పి గట్టిగా శబ్దాలు చేయడంతో ఎలుగుబంటి జామ తోటలోకి వెళ్లింది. ఈ విషయాన్ని పొరుగున ఉన్న పొలాల రైతులకు తెలియడంతో భయాందోళన చెందుతున్నారు.

నేడు సచివాలయ సదస్సు



కరపత్రాలు విడుదల చేస్తున్న సచివాలయ సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురం ఈనెల 28న జరిగే సచివాలయ సదస్సుకు తరలి రావాలని సచివాలయ సిబ్బంది కోరారు. శనివారం సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ సిబ్బందిపై కక్ష పెత్తనం ఆపాలని, వార్డు శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల పట్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కమిషనర్ల వేధింపులు ఆపాలని కోరారు. ధర్మవరంలో అక్రమంగా అరెస్టు అయిన శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ పభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు నవీన్, శ్రీకాంత్, తిమ్మరాజు, అశోక్, గద్దరాము, షఫీ, రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి రథానికి విరాళాలు



ఆంజనేయస్వామి రథం నిర్మాణానికి విరాళాలు అందిస్తున్న దాతలు

ఉరవకొండ: మండల పరిధిలోని బూదగవి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ నూతన రథం నిర్మాణానికి శనివారం భక్తులు విరాళాలు అందించారు. ఆలయ అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో బెస్త అనిల్‌కుమార్ రూ.20 వేలు, బెస్త నాగరాజు రూ.10 వేలు, గోవిందు రూ.5016, నాగేంద్ర రూ.5016, జయమ్మ రూ.5 వేలు, బాలదండి హనమంత రాయుడు రూ.5,555 అందించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: స్థానిక కేటీఎస్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వృక్షశాస్త్రం, వాణిజ్యశాస్త్రం అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రఘురామమూర్తి శనివారం తెలిపారు. పోస్టుగ్రాడ్యుయేషన్ (పీజీ)లో 55 శాతం ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులని చెప్పారు. నెట్, సెట్, పీహెచ్‌డీ విద్యార్హతలు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 29 ఉదయం 11:30 గంటలకు కళాశాలలో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

తహసీల్దార్‌కు సన్మానం



బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ నిత్యానంద బాబును సన్మానిస్తున్న దృశ్యం

కంబదూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన తహసీల్దార్లను ప్రభుత్వం సొంత జిల్లాలకు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కంబదూరు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న నిత్యానందబాబు తిరిగి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌ను రీ సర్వే డీటీ గణేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం సన్మానించారు. నూతన తహసీల్దార్ నియమితులయ్యే వరకు రీ సర్వే డీటీ గణేష్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి పల్లకీ ఉత్సవం





కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయం వద్ద అలంకరణలో వెంకటేశ్వరస్వామి, పల్లకీ ఉత్సవంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజన్న

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం పల్లకీ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ప్రతిష్టించి, మాఢవీధుల్లో ఊరేగించారు. మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బంగి ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షుడు రామస్వామి, ప్రచార కార్యదర్శులు ప్రసాద్, ఆవుల మనోహర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్టీటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వెకంటేశ్వర స్వామి ఆలయంలో, మున్సిపాల్ కార్యాలయం వద్దనున్న వెకంటేశ్వర స్వామి ఆలయాల్లో ఏడు శనివారాల వ్రతంలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆశాఢ మాసం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో అంజన్నకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేలరాలని చినుకు.. ఆకాశం వైపు రైతు చూపు

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు మొహం చాటేశాడు. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. జూలై నెలలో సాధారణ వర్ష పాతం 33 మిల్లీ మీటర్లు కాగా, మండలంలో కేవలం 9 మిల్లీ మీటర్ల వర్షం కురిసిట్లు మండల గణాంకాధికారిణి ఆశా శనివారం తెలిపారు. మండలంలో ఖరీఫ్ వేరుశనగ సాధారణ విస్తీర్ణం 25 వేల ఎకరాలుగా ఉంది. అయితే పంటల దిగుబడి రావాలంటే జూలై 15 లోపు వేరుశనగ విత్తుకోవాలని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఈనెల 31లోపు విత్తుకుంటే దిగుబడి కొద్దిగా తగ్గవచ్చని, ఆ తర్వాత వేరుశనగ విత్తుకోవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మండల వ్యాప్తంగా 3,502 మంది రైతులు ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగ 3,240 క్వింటాళ్లు కొనుగోలు చేసి విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. అదును దాటిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కూడేరు మండలం అంతరగంగ వద్ద బీడుగా మారిన భూమి

ఆలయ భూముల సాగుకు వేలం



సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయశాఖ అధికారి నరసింహారెడ్డి

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామ కల్లేశ్వర స్వామి ఆలయ భూముల సాగువేలం పాట పోటాపోటీగా సాగింది. శనివారం కల్లేశ్వరస్వామి ఆలయంలో దేవదాయశాఖ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. గ్రామస్తులు ఈ వేలం పాటలో పాల్గొన్నారు. 16 ఎకరాలకు వేలం వేయగా రూ.6.80 లక్షలకు రైతులు దక్కించుకున్నట్లు దేవదాయశాఖ అధికారి తెలిపారు. ఇది ఇలా ఉండగా ఆలయానికి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు అధికారిని కోరారు. ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు దేవదాయశాఖ అధికారి తెలిపారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

- జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.రమ్య



ఎస్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, లెక్చరర్లతో జడ్జి ఎమ్.రమ్య

రాయదుర్గం: వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.రమ్య తెలిపారు. శనివారంమండలంలోని ఉడేగోళం వద్దనున్న కేటీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జీ ఎమ్.రమ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని దేశ అత్యున్నత న్యాయస్థానం హెల్మెట్ వాడకాన్ని తప్పిసరి చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. హెల్మట్ వాడకంతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం చట్టరీత్యా నేరమని గుర్తు చేశారు. యువత ప్రమాదభరిత విన్యాసాలతో డ్రైవింగ్, మత్తు పదార్థాలు తీసుకొని వాహనం నడపడం, డబుల్, త్రిబుల్ రైడింగ్ చేయడం లాంటావి సరైన పద్ధతికాదన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా బాధ్యతగా చదువుకోవాలన్నారు. అనంతరం జడ్జిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్లు హరికృష్ణ, లోకానంద, కళాశాల లెక్చరర్లు, గుమ్మఘట్ట ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుష్టుబాధితుల జీవనోపాధి కల్పనకు చర్యలు



కూడేరు: రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనుపమ జేమ్స్

కూడేరు: మండలంలోని కుష్టుబాధితులకు జీవనోపాధి కల్పించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. మండల కేంద్రంలోని లెప్రసీ కాలనీకి చెందిన కుష్టు రోగులు కాలనీ వద్ద పండ్ల మొక్కలు సాగు చేసుకొని జీవనం సాగించేందుకు భూమిని కేటాయించాలని కలెక్టర్ వినోద్ కుమార్‌కు విన్నవించుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ డీఎంహెచ్‌ఓ, లెప్రసీ ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ మండల రెవెన్యూ, హార్టికల్చర్, వైద్య శాఖ అధికారులతో కలిసి లెప్రసీ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. అక్కడ ప్రభుత్వ భూమి ఎంత ఉంది? పండ్ల మొక్కల సాగుకు ఎంత భూమి అనువుగా ఉంటుందని అధికారులతో ఆరా తీశారు. తర్వాత భూమిని పరిశీలించారు. నాలుగు ఎకరాల్లో మామిడి, జామ, సపోట పండ్ల మొక్కలు సాగు చేసుకుంటామని, పండ్ల విక్రయంతో వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తామని కుష్టు రోగులు ఆమెకు విన్నవించుకున్నారు. పండ్ల మొక్కల సాగుకు నేల అనువుగా ఉంటుందన్న నివేదికను కలెక్టర్‌కు పంపుతామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓలు సత్యనారాయణ, రాముడు, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, ఆర్ఐ ప్రసన్న కుమార్, వీఆర్వో రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరిగా పాటించాలి



అంగన్‌వాడీల క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ వనజా అక్కమ్మ

కంబదూరు: అంగన్‌వాడీ కార్యకర్తలందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సీడీపీఓ వనజా అక్కమ్మ అన్నారు. శనివారం కంబదూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 9 గంటలకే తెరవాలన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా, సకాలంలో పంపిణీ చేయాలన్నారు. సమయపాలన పాటించని అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సూపర్‌వైజర్ జ్యోతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల పాఠశాలలో శిక్షా సప్తాహ్



ఎస్సీ గురుకుల పాఠశాలలో మొక్కల పెంపకంపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శిక్షా సప్తాహ్ విద్యవారోత్సవాల్లో భాగంగా పేరెంట్స్ కమిటీ భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థినులు మొక్కలు పెంచి, వాటిని సంరక్షిస్తే మనందరికీ మనుగడ ఉంటుందన్నారు. జిల్లా ఎడారిగా కాకుండా మొక్కలు పెంచి, కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, లైబ్రేరియన్ కుళ్లాయమ్మ, ఉపాధ్యాయినులు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు అందిద్దాం



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

అనంతపురం కల్చరల్: సనాతన భారతీయ సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించడం మన కర్తవ్యమని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. అనంత వేదికగా ఐదు రోజుల పాటూ సాగే ప్రవచనంలో భాగంగా నగరానికి వచ్చిన ఆయన శనివారం పలుచోట్ల జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. రెండవ రోడ్డులోని శ్రీ జ్ఞానపీఠం మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో స్ఫూర్తినందిస్తున్న పీఠం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు షణ్ముఖశర్మకు 'జ్ఞానదీపశిఖ' బిరుదుతోనూ, గోటేటి శ్రీనివాసరావుకు 'శ్రీవిద్యాభాస్కర' బిరుదులతో దంపతసమేతంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీజ్ఞానపీఠం ద్వారా ముద్రించిన శ్రీసపర్య కదంబం, గురు సపర్య , త్యాగరాజ సౌరభం, అంతర్జార అనే పుస్తకాల ఆవిష్కరణ ఘనంగా జరిగింది.

కనుల పండువగా శోభాయాత్ర

సాయంత్రం రామకృష్ణ సేవా సమితి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలో భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. వెండిరథంపై షణ్ముఖశర్మను ఊరేగింపుగా తీసుకువచ్చారు. దేవరకొండ కౌసల్య శిష్యబృందాల కోలాటంతో ఆకట్టుకున్నారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం ప్రదర్శించిన శివపదం నాట్య కళారూపం భక్తిభావం ఉట్టిపడేలా సాగింది. అనంతరం షణ్ముఖ శర్మ శివసాక్షాత్కారం అనే అంశంపై మహాశివుని లీలా విశేషాలను తెలియజేశారు. రామకృష్ణ సేవా సమితి, ఇన్నర్‌వీల్ ప్రతినిధులతో పాటూ పలు ఆధ్యాత్మిక, కళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సమష్టిగా కృషి చేయండి



కూడేరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ లలిత

కూడేరు: ప్రజారోగ్య పరిరక్షణకు పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలలిత సూచించారు. శనివారం ఆమె తన చాంబర్‌లో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. దోమ కాటుతోనే రోగాలు వ్యాపిస్తాయన్నారు. కాబట్టి దోమలు వృద్ధి చెందకుండా వచ్చే నెల 10 వరకు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. తాగునీటి పైపుల నుంచి నీరు లీకేజీ కాకుండా చూడాలని తెలిజేశారు. ఆగస్టు 1న సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీ పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

నేడు విప్లవవీరుల సంస్మరణ సభ

అనంతపురం కల్చరల్: స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు కమ్యూనిస్టు అగ్రనేతలు కామ్రేడ్ నాగిరెడ్డి, కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు సంస్మరణ సభ నిర్వహించనున్నారు. భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం (ఎంఎల్) ఆధ్వర్యంలో ఓపీడీఆర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలు, విప్లవ రచయిత జెట్టీ జైరాం, భారత-చైనా మిత్రమండలి రాష్ట్ర కార్యదర్శి వై.అజయ్‌రెడ్డి ఆత్మీయ అతిథులుగా ప్రసంగిస్తారని సంస్థ కార్యదర్శి భాస్కర్ తెలిపారు.

విద్యారంగ సమస్యలపై జీపుజాతా



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జీపుజాతా చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయి స్వామి మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీపుజాతా అనంతపురంలో ప్రారంభమై నార్పల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, రాప్తాడు వరకూ సాగుతుందన్నారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లు, గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు, హాస్టళ్ల భవనాల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్, ట్యూటర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, రాష్ట్ర సమితి సభ్యురాలు సాయి స్వరూప, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ, సహాయ కార్యదర్శి ఆంజనేయులు, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్ ఉమా మహేష్, నాయకులు రాధా, జ్యోతి, హర్ష, నాని, చైతన్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి



ఇన్‌చార్జ్ తహసీల్దార్ గణేష్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కంబదూరు: కంబదూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వెంకటేశులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ గణేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు ఎంపీసీ విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సాయిహర్ష, మోహన్‌రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవులదట్లలో పట్టపగలు చోరీ

రాయదుర్గంటౌన్: మండలంలోని ఆవులదట్ల గ్రామంలోని ఓ ఇంట్లో నగదు చోరీ చేసి ఉడాయిస్తున్న ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు శనివారం అప్పగించారు. గ్రామంలోని శ్రీనివాస నాయక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు చొరబడి బీరువా పగలగొట్టి రూ.10 వేలు నగదు ఎత్తుకెళ్తుండగా, స్థానికులు వెంబడి పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని చోరీపై విచారణ చేపట్టారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆసియా

కంబదూరు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యం పాలు కాకుండా ఉంటారని వైద్యాధికారి ఆసియా తెలిపారు. శనివారం మండలంలోని తిమ్మాపురం అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కంబదూరు కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆసియా మాట్లాడుతూ డైటింగ్ పేరుతో చాలా మంది విద్యార్థులు ఆహారం తక్కువగా తీసుకుంటున్నారని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు కచ్చితంగా ఐరన్ టాబ్లెట్లు వాడాలని తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ఎం కమలమ్మ, సూపర్ వైజర్ హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ దేవమణి తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు



బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ రామాంజనమ్మను సన్మానిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ రామాంజనమ్మ, ఈఓపీఆర్డీ దాస్ అన్నారు. శనివారం బొమ్మనహాళ్ తహసీల్దార్ రామాంజనమ్మ కర్నూల్ జిల్లాకు బదిలీ కావడంతో స్థానిక వెలుగు కార్యాలయంలో సన్మాన సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి నెలలో కర్నూల్ జిల్లా నుంచి బొమ్మనహాళ్ తహసీల్దార్‌గా రామాంజనమ్మ బాధ్యతలు చేపట్టారు. తిరిగి సొంత జిల్లాలకు తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేయడంతో శనివారం రిలీవయ్యారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, జేఈఈ జగదీష్, ఎంఈఓ మల్లికార్జున, ఏఓ సాయికుమార్, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్ఓలు నరసింహమూర్తి, సుజాత, శృతి, రామన్న, ప్రసాద్ , వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



ప్రసవం తర్వాత బిడ్డను అందిస్తున్న ఈఎంటీ సుధాకర్

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన సుప్రజ అనే గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. దేవగిరికి చెందిన గర్భిణి సుప్రజకు శుక్రవారం రాత్రి 11.35 గంటలకు పురిటి నొప్పులు వచ్చాయి. 108 వాహనంలో సుప్రజను కణేకల్లు ఆర్టీటీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, యర్రగుంట గ్రామం సమీపం వద్దకు రాగానే నొప్పులు అధికమయ్యాయి. పైలెట్ 108 వాహనాన్ని రోడ్డు పక్కన ఆపారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అదే 108లోనే తల్లీబిడ్డను కణేకల్లు క్రాస్‌లోని ఆర్టీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలియజేశారు. సురక్షిత ప్రసవం చేసిన 108 వాహన సిబ్బందికి సుప్రజ భర్త వెంకటేష్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.